# అల్పమానవుడు

చిన్న కుదుపుతో ఆగింది కారు.

వెనక సీట్లో కూర్చుని జోగుతున్న నేను మెల్లగా కళ్ళు తెరచి బయటికి చూశాను.

పెళ్ళి పందిట్లో ఆగింది కారు. పందిట్లో ఆడుకొంటున్న పిల్లలు కారుని సమీపించి ఆశ్చర్యంగా చూడసాగారు. అరుగుమీద కూర్చున్న పెద్దలూ బంధువులూ హడావిడిగా లేచారు.

"ఈ ఇల్లేసాబ్" డోరు తీస్తూ అన్నాడు డ్రైవరు.

"వూఁ" మెల్లగా సర్దుకుని కారు దిగుతోంటే మా పినమావయ్య వరుగు నొచ్చాడు.

"ప్రయాణం బాగా సాగింది కదా? ఒక్కరే వచ్చారు. అమ్మాయినీ పిల్లల్నీ కూడా తీసుకొస్తారని చూస్తున్నాం"

"పిల్లల చదువుకి ఇబ్బంది కలుగుతుందని రాలేదు"

"పోన్లెండి. మీ రొచ్చేరు. మా కెంతో సంతోషంగా వుంది. రండి ఒరేయ్ సాంబూ-కార్లోని సూట్ కేస్‌ని లోపల పెట్రా!"

ఇంతలో ఓ కుర్రాడు చెంబుతో నీళ్ళు తెచ్చిచ్చాడు.

"బూటు తియ్యడం ఎందుకు లెండి చేతులు కడుక్కొండి చాలు"

చిన్నగా నవ్వుకుంటూ చేతులు కడుక్కొని మా పినమావయ్య అందిచ్చిన టవల్‌తో చేతులు తుడుచుకున్నాను.

అరుగు మీద వాల్చి వున్న పడక కుర్చీని తన పైపంచెతో తుడిచి "ఇలా కూర్చోండి. ఒరే అబ్బాయ్! మావయ్యగారికి టీ ఇమ్మను" అని కేకేశారు.

కుర్చుని కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ "ముహూర్తం ఎన్నింటికి మావయ్యా" అనడిగాను ఏమీ మాట్లాడక పోతే బావుండదని.

"రాత్రి 20-15 కి"

"అహా!"

"ఇప్పుడే వస్తాను" అంటూ హడావిడిగా వెళ్ళిపోయాడాయన.

మా పినమామయ్యా నేనూ ఎంచుమించు నమస్కాలమే. లేక పోతే నా కన్నా ఒకటీ రెండు సంవత్సరాలు పెద్దవాడేమో అంతే. నేను చదువుకొని వుద్యోగమంటూ వూళ్ళు తిరిగి ప్రస్తుతం హైదరాబాదులో కమ్మర్షియల్ టాక్స్ డిపార్ట్ మెంట్లో ఆఫీసరుగా పని చేస్తున్నాను. మా పిన మావయ్యేమో వ్యవసాయం చేస్తూ స్వగ్రామంలోనే వుండిపోయాడు. అందుచేత నా హోదా దృష్ట్యా నాకెంతో గౌరవాన్నిస్తూ మన్నించి మాట్లాడుతూంటాడు.

ఏ శుభకార్యాలకో తప్ప మేం ఇటు కేసి రావటమే లేదనలు. తన కొడుకు పెళ్ళికి తప్పకుండా రావాలని మరీ మరీ కోరడంతో ఓ సారెళ్ళి అందర్నీ చూసినట్టూ వుంటుంది, మన గొప్ప అయినా వాళ్ళందరికీ ప్రదర్శించినట్టూ వుంటుందనొచ్చాను.

"ఇప్పుడు మనం హైదరాబాదులోనే పని చేస్తున్నామండి" ఓ పెద్దాయన చేతులు నలుపుకుంటూ వచ్చి అడిగాడు.

"అవునండి" కిటికీల్లోంచీ తలుపు సందుల్లోంచీ నన్ను చూస్తోన్న ఆడవాళ్ళని చూసీ చూడనట్టు చూస్తూ అన్నాను.

"ఆ మధ్య ఇల్లు కట్టారని విన్నాను...."

"అవునండీ హైదరాబాదులోనే ఓ డాబా కట్టించాను. దగ్గర దగ్గర లక్షయాభై వేలయ్యింది"

"అబ్బా! మీరు ఆఫీసర్లు గనుక సిమ్మెంటూ గట్రా సరమైన ధరకి దొరుకుతాయి గనుక ఆ మాత్రంలో తెమిలింది గాని మా బోటి వాళ్ళు కట్టాలంటే చులాగ్గా రెండు లక్షలయ్యేది. ఏమంటారు?"

అవునన్నట్టు తలాడించాను.

"మిమ్మల్ని లోపలికి రమ్మంటున్నారండి" ఓ పదిహేనేళ్ళ కుర్రాడొచ్చి అన్నాడు కంగారు పడుతూ.

వీళ్ళందరికీ నేను ఓ గొప్ప వ్యక్తిలా కన్పిస్తున్నందుకూ వీళ్ళు నాకు రాచమర్యాదలు చేస్తున్నందుకూ సంతోషంతో నవ్వుకుని బూట్లు విడిచి అతని వెంట గదిలో కెళ్ళాను.

చెక్క టేబుల్ మీద రెండురకాల స్వీట్లూ హాటూ పెట్టివున్నాయ్. పాతకాలం నాటి కుర్చీ కూడా వుంది.

ఇబ్బందిగా కూర్చుని కొంచెం రుచి చూశాను.

"అయ్యయ్యో" అన్నీ అలాగే వుంచేశారు. పోనీ ఉప్మా చేయించమన్నారా?" అన్నాడు పిన మావయ్య.

"ఇంకేం వద్దు మావయ్యా"

టీ వచ్చింది. మెల్లగా చప్పరిస్తోంటే "అమ్మాయీ పిల్లలూ అంతా కులాసానండీ" అనడిగిందాయన భార్య తలుపుచాటున నిలబడి.

"కులాసాయేనండి. అడిగినట్లు చెప్పమంది"

"అమ్మాయీ పిల్లలూ వస్తారని ఎదురు చూస్తున్నామండి...."

"తనూ రావాలనే సరదాపడింది. కాని పిల్లలకి శలవుల్లేక రాలేక పోయిందండి"

"అమ్మాయి కూడా వచ్చి ఆ కాస్సేపూ పెద్ద తరహాగా నిలబడితే అందంగా వుండేదండి"

"దాన్దేముంది లెండి"

మరి మాట్లాడలేదామే. బహుశా ఓ నిమిషం నిలబడి వెళ్ళిపోయుంటుంది.

"ప్రయాణం చేసి అలసివుంటారు. కాస్సేపు నడుం వాలుస్తారు" మా పిన మావయ్య అడిగాడు.

తలూపి "పెళ్ళికొడుకెక్కడా కన్పించడేం" అన్నాను.

"స్నేహితుల్ని పిలవడానికి వెళ్లాడు. కాస్సేపట్లో వస్తాడు"

వాళ్ళకున్నది ఒక్కటే పడగ్గది. దానిని నాకు కేటాయించేశారు. నేను వద్దన్లేదు. లుంగీ కట్టుకుని పందిరి మంచం మీద పడుకున్నాను.

నాకు మెలకువ వచ్చేసరికి ఇల్లంతా హడావిడిగా వుంది. లేచి కూర్చున్నానో లేదో ఓ కుర్రాడు జేరవేసిన తలుపుల్ని కొంచెంగా తోసి తల లోపలికి పెట్టి నన్ను చూసి తుర్రుమని పారిపోయాడు.

మరి రెండు నిమిషాలకి మావయ్య పని కుర్రాడితో బకెట్టుతో నీళ్ళూ సబ్బూ టవలూ పట్టించుకొచ్చి "స్నానం చెసెయ్యండీ సందులో. వేడి నీళ్ళే. బడలిక తగ్గుతుంది" అన్నాడు.

పెళ్ళి పనుల్లో తలమునకలవుతూ కూడా నాకెంతో ప్రాముఖ్యత నిస్తూ అవసరాలన్నిట్నీ స్వయంగా చూస్తున్నందు కాయన మీదెంతో అభిమానం కలిగింది. అయినా ఆ సంగతి బయట పెట్టడం మన డిగ్నిటీకి లోపమని వూరకుండిపోయాను.

స్నానం ముగించి మళ్లీ టీ త్రాగి వీధిలో కొచ్చేసరికి "రండి రండి" అంటూ ఆహ్వానించారు పెద్దలూ బంధువులూ కూర్చున్నవాళ్లల్లా లేచి నిలబడి.

ఓ కుర్చీలో కూర్చున్నాను. ఇంకా రెండు కుర్చీలున్నా వాటి మీదె వరూ కూర్చోలేదు. అంతా చాపల మీద బరకాల మీద చతికిలబడ్డారు.

"నమస్కారమండి" పెళ్ళికొడుకొచ్చి పలకరించాడు.

"ఏమోయ్-ప్రొద్దుట్నుంచీ ఎక్కడా అయిపులేవూ. చదువెలా సాగుతోంది"

"బాగానే వుందండి"

"క్లాసు తెచ్చుకోవాలి మరి"

"అలాగేనండి"

"బాగా చదివి పాసైతే మీ బావగార్నికు మంచి వుద్యోగం వేయించి నిన్ను పైకి తీసుకొస్తార్రా అబ్బాయ్" అన్నాడో బంధువు.

చిన్నగా మందహాసం చేసి వూరుకున్నాను.

పెళ్ళికొడుకు కాళ్ళగోళ్లు తీసేకార్యక్రమం అయ్యాక బంధువులకీ వూళ్ళో వాళ్ళకీ భోజనాలొడ్డించారు. నన్ను గదిలో కూర్చోబెట్టకుండా గదిలో టేబుల్ మీల్స్ వడ్డించారు ప్రత్యేకంగా.

పెళ్ళికి తరలి వెళ్లడానికి రెండెడ్ల బండిని సిద్ధం చేస్తోంటే "పెళ్ళి కొడుకు కూడా బండి మీదే వెళ్తాడా" అనడిగాను మావయ్యని.

"చిన్న కారు మాట్లాడదామని చూశాంగానీ చాలా అడిగారు. అందుకని...."

"అయితే నా కార్లో వస్తాంలే"

"మీ కార్లోనా. మీకు ఇబ్బందేమో...."

"నాకు ఇబ్బందేమిటీ. కార్లో కూర్చుంటాను గాని కాళ్ళు జాపి పడుకోను కదా" నవ్వుతూ అన్నాను.

"మీదెంత మంచి మనస్సు, అలాగేనండి" అంటూ పెళ్లి మా

మేనల్లుడు తన కార్లో పెళ్లికొడుకుని తీసుకెళ్తానంటున్నాడని గొప్పగా చాటింపేసి మరీ చెప్పేడందరికీ.

ఓ నలుగుర్ని నా కారెక్కించమని చెప్పినా వినకుండా పెళ్లికొడుకునీ తోటిపెళ్లి కొడుకునీ మాత్రం ఎక్కించాడు పినమావయ్య.

పెళ్లికి భీమవరం వెళ్లాం.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలుకి దగ్గర్లోని లాడ్జిలో విడిది నేర్పాటు చేశారు. విడిదిలో ప్రవేశించేసరికి నన్నూ నా ఫుల్ సూటునీ చూసి ఆడపెళ్లి వారు కంగారు పడి నా గురించి పెళ్లికొడుకు నడిగారు. ఆ పుత్తర క్షణం నుంచీ పెళ్లి కొడుక్కన్నా ఎక్కువగా నాకు మర్యాదలు చెయ్యసాగారు!

పెళ్లి కార్యక్రమం మొదలవుతోందన్చెప్పి పిన మావయ్య స్వయంగా నన్ను పిల్చుకెళ్లాడు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలుకి. అప్పటికే నా గురించందరికీ తెలీడంతో అంతా నన్ను వి.ఐ.పి.గా చూడసాగారు. ఆడవాళ్లు కూడా చెవులు కొరుక్కోసాగారు.

కళ్యాణ మంటపానికి దగ్గరగా ఓ ప్రత్యేకమైన కుర్చీ వేశారు నా కోసం.

కూర్చున్నాను.

నాకు పెళ్లీడు కొచ్చిన అమ్మాయి వుందని తెలిసి కాబోలు బంధువుల్లోని పెళ్లి కెదిగిన మగపిల్లలూ వారి తండ్రులూ వసున్నా లేకపోయినా నా చుట్టూ తిరగసాగారు.

నేను బాగా కట్నం ఇవ్వగలననే వాళ్ళకి తెలుసు గాని హైదరాబాద్‌లో సెటిల్ అయిన ఏ డాక్టరుకో ఇంజినీరుకో మా అమ్మాయి నివ్వా లనుకుంటున్నామని పాపం వీళ్లకి తెలీదు కదాని జాలిపడ్డాను.

ఆడ పెళ్లివారి తాలూకతను గోల్డ్‌స్పాట్ తెచ్చిచ్చాడు నాకు. అంద

రికీ ఇస్తున్నారు కాబోలనుకున్నాను. కాని నా ఒక్కడికే ఆ ఆతిధ్యం పరిమితమని వెంటనే తెలిసింది.

ఒకళ్లిద్దరు తాము రైస్ మిల్లు కట్టాలనుకుంటున్నామనీ లైసెన్సు మొఎలైన వ్యవహారాల్లో సాయం చెయ్యాలని అర్థించారు. ఇంకొకరు ఏ సీ టి వో తన మీద కేసు పెట్టాడనీ తప్పించి పుణ్యం కట్టుకోవాలనీ అడిగాడు కళ్లనీళ్లు పెట్టుకుని.

"అలాగే తప్పకుండా" అంటూ హామీ నివ్వక తప్పలేదు.

"నేన్చెప్పలేదూ మనవాడు మనవాడేననీ. ఎంతో సంపాదించినా పెద్ద హోదాలో వున్నా పిసరంత గర్వం కూడా లేదనుకో" అంటూ నా వెనుక చెప్పుకొంటోన్న మాటలకి నా భుజాలు రెండు అంగుళాలు పొంగాయ్.

ఇంతలో ఎవరో కరపత్రాలు పంచారు. అవి మామూలు పత్రాలు కాదు. వధూవరుల్నాశీర్వదిస్తూ ఓ తెలుగు పండితుడు వ్రాసిన పంచ పద్య రత్నాలు. చదివి బాగానే రాశాడను కొంటోంటే బహుశా ఆ మాస్టారే కాబోలు మైకు దగ్గరి కెళ్లాడు.

వధూవరులకి నూతన వస్త్రాలు బహూకరించి వాటిని కట్టుకుని రమ్మన్నారు పురోహితులు.

ఈ విరామంలో మాస్టారు తను వ్రాసిన పద్యాల్ని రాగయుక్తంగా చదివారు. కరపత్రంలోని అయిదు పద్యాలూ చదివేశాక ఓ చిన్న కాగితం మీద వ్రాసుకున్న మరో పద్యం కూడా చదివారు. అది విని దిగ్భ్రాంతుడ్నయ్యాను. జనమంతా నా వంకే చూస్తున్నారని నాకు తెలుసు.

భాగ్యనగరంలో వున్నతోద్యోగంలో వున్న నేను, కులశేఖరుడనైన నేను, ప్రముఖుల్లో కెల్ల ప్రముఖుడనైన నేను, బంధుప్రేమ అధికంగా గల నేను, గర్వంకేశ మాత్రమూ లేని నేనీ వివాహానికి ప్రత్యేకంగా

వచ్చి నూతన దంపతుల్ని ఆశీర్వదిస్తోన్నందుకు వారికి నిజంగా కొండంత శుభం జరుగుతుందని ఆ పద్య భావం!

చెప్తొద్దూ- నా ఒళ్ళు ఒక రకమైన తీయని భావంతో పులకరించి పోయింది. పెదాలపై చిరునగవు మెరిసింది. మనస్సు ఆనందం పట్టలేక పిల్లి మొగ్గలేసింది.

వాళ్ళేదో పొగిడేస్తున్నందుకూ గొప్పగా మర్యాదలు చేస్తున్నందుకూ తను పూరికే పొంగిపోతున్నాడు గాని నిజానికి తను వీటన్నిటికీ అర్హుడే. ఆ కవి అన్నట్టు తను గొప్పవాడే. ముఖ్యాతిముఖ్యుడే. అంచేతే వీళ్లింత గౌరవమిస్తున్నారు. ఇక్కడున్న వాళ్ళంతా మట్టి పిసికే సామాన్యులూ సామాన్య వుద్యోగులే కదా!

ఈ రకం భావన కలిగేసరికి నేనెంతో పెద్దవాడ్నై పోయినట్టూ జనమంతా మరుగుజ్జులై పోయినట్టూ కనిపించసాగింది నా కళ్లకి!

ఆ కవిగారు నా దగ్గరి కొచ్చి "నమస్కారం సార్. ఆశీస్సు పద్యాలు వ్రాసిన తెలుగు పండితుణ్నండి. పద్యాలెలా వున్నాయి సార్" అనడిగాడు పొగడ్త వినడానికి మెడచాచి మరీ.

"చాలా బాగా రాశారు"

"చాల్సార్. సామాన్యులు సవాలక్ష మంది మెచ్చుకుంటే ఏం లాభమండి ? మీలాంటి పెద్దలు ఒక్కరు మెచ్చుకుంటే చాలు మా ప్రతిభకి గుర్తింపు లభించినట్లే."

పెట్రో మాక్స్ లైట్‌లా వెలుగుతోందతని మొఖం. పూర్ ఫెలో!

కన్యాదాత వచ్చి తాంబూలమూ అర్ధ నూట వదహార్లూ ఖద్దరు శాలువా నా చేతి కిచ్చి ఆ కవిగార్ని సత్కరించమన్నారు.

అలాగే చేశాను.

చప్పట్లు మార్మ్రోగాయ్.

పుత్ర పౌత్రుల్తో భోగభాగ్యాలతో సుఖ సంతోషాలతో తులతూగ మని ఆశీర్వదించి మరీ వెళ్ళేడాయన.

అంతకంతకీ నా స్టేటస్ పెరిగిపోతోంటే నాకు తెలీకుండానే నాలో ఒక రకమైన ఠీవి చోటు చేసుకోసాగింది. కుర్చీలో స్టైయిలుగా కూర్చుని గర్వంగా ఫీలవుతూ అందర్నీ కాస్త జాలిగా చూడసాగాను.

తాళిబొట్టుని చేత్తో పట్టుకుని అక్షింతల్ని నాతో మొదలు పెట్టి అందరికీ పంచాడు పురోహితుడు.

జీలకర్రా బెల్లం పెట్టించడానికి వరుడ్ని రెడీగాడో బ్రాహ్మడు.

రెండో బ్రాహ్మడితో ఏదో చెప్పి మొదటాయన లేచి నా దగ్గరి కొచ్చాడు.

"ముహూర్తాని కింకా వ్యవధి వుందాండీ" అనగానతడ్ని

"వుందండీ. ఈలోగా చిన్నమాట తమకి మనవి చేద్దామనొచ్చాను. తర్వాత మిమ్మల్ని కలునుకోవడం కుదరక పోవచ్చు"

"ఏ సంగతి ?"

"మా అబ్బాయి ఇంటర్ పాసయ్యాడండి. పైపు హయ్యార్ షార్ట్ హేండ్ లోయరూ కూడా పాసయ్యాడు. హైదరాబాదులో మా తోడల్లుడి గారబ్బాయి ఏదో చిన్న వుద్యోగం చేస్తూ మా వాడ్ని వచ్చెయ్యి వుద్యోగ ప్రయత్నాలు చేద్దామంటున్నాడు. సిఫారసుల్లేకపోతే చిన్న పనులు కూడా కాని రోజులు కదాని ఆలోచిస్తున్నానండి. తమరు కాస్త మాట సాయం చేస్తానంటే మా వాడ్ని పంపించేస్తానండి"

మాటసాయం ! ఎంత తేలిగ్గా అంటున్నాడు !

"పంపించండి చూద్దాం"

"మీరా మాటన్నారు అదే పదివేలు" నమస్కరించి ఏవో మంత్రాలు చదువుతూ మంటపంలో కెళ్ళి జీలకర్రా బెల్లం పెట్టించాడు వధూవరులచేత.

తాళి కట్టడం కూడా అయ్యింది. లేచి అక్షింతలువేసి చిన్నగా ఒళ్ళు విరుచుకుని హాలు బయటి వరండాలో కెళ్ళి త్రిబుల్ ఫైవ్ సిగరెట్ వెలిగించాను.

నాకొ్కద్దీ దూరంలో వరండాలో నిలబడి కబుర్లు చెప్పుకొంటున్న యువకుల మాటల్లో నా ప్రసక్తి దొర్లే సరికి పులిక్కిపడి చెవులప్ప గించాను.

"ఆయనెవర్రా"

"మన రాంబాబుకి బావ అవుతాడ్లే. కమ్మర్షియల్ టాక్సెస్ డిపార్ట్ మెంట్‌లో పెద్ద ఆఫీసరు. రెండు చేతులా సంపాదిస్తున్నాడ్లే."

నవ్వులు.

"మామూలు సంపాదన కాదురా బాబూ దేశాన్ని నిలువునా తినేస్తు న్నాడు. అయిదారెకరాల పొలం కొన్నాడు. రెండు మూడు లక్షల ఖరీదు చేసే ఇల్లు కట్టాడు. బ్యాంకుల్లో ఎంతో వుందిట. పిల్లలకి పెద్ద చదువులూ పెళ్లానికి మెడనిండా నగలూనూ. గొప్పగా వెలుగుతున్నాడ్లే గురుడు"

"ఈ వెలుగెన్నాళ్ళులే, పాపం పండే వరకే. పండే వరకూ కాయ కూడా ఇలాగే మిడిసి పడుతుంది. పండేక దబుక్కున రాలి పడుతుంది. వీళ్లూ అంతే. ఎప్పుడో ప్రభుత్వ దృష్టిలో పడతారు. అప్పుడు శ్రీమతే రామానుజాయన్నమః!"

అంతా గట్టిగా నవ్వేశారు.

ఆ చల్లని వాతావరణంలోనూ ముచ్చెమటలు పోశాయి. వాళ్ల వంక చూడ్లేకపోయాను. సిగరెట్ పారేసి తడబడుతూ హాల్లోకి నడిచాను.

"ఎటు వెళ్లారు ? ఇందాకట్నుంచి మీ కోసం వెదుకుతున్నాం. పదండి లాడ్జిలో పడుకుందురు గాని"

పినమావయ్య మొఖంలోకి సూటిగా చూశాను. ఆయన్లో కల్మషం లేదు. ఆ మాటలు మనస్ఫూర్తిగా అంటున్నాడు.

వీళ్లందరికీ తను లంచగొండినని తెలుసు. చీడ పురుగూ దేశద్రోహి లాంటి మాటలు తెలీక పోయినా ఆ బాపతేనని తెలుసు. అయినా వీళ్ళు-మరుగుజ్జులుగా తను చూసిన ఈ పల్లెటూరి బైతులేం చేస్తున్నారు? తన లోని చెడుని పట్టించుకోకుండా తనలో వున్న గోరంత మంచినీ కొండంత చేస్తూ పొగుడుతున్నారు. గౌరవిస్తున్నారు. వాళ్ళ చిన్నవాళ్ళ సామాన్యులూ గనుక అలా చేస్తున్నా రనుకున్నాడుగాని వాళ్ల గొప్ప మనస్సు గుర్తించ లేకపోయాడు తను.

నిజానికి వాళ్ల ముందు వారి నిస్వార్థ అభిమానాల ముందు నిలబడ గల అర్హతుందా తనకి ?!

"ఏవి టాలోచిస్తున్నారు ?"

"ఏం లేదు ఏం లేదు...."

అప్రయత్నంగా వరండా వైపు చూశాను. నా వంకే చూస్తున్నారు ఇందాకటి యువకులు.

నా తల భూమిలోకి కృంగిపోతోంచే తల త్రిప్పేసుకున్నాను. ఆఖరికి మావయ్య వంక కూడా చూళ్ళేక పోతున్నాను. ఎందుకో నా తల వంగి పోతోంది. నా శరీరం కుంచించుకుపోతోంది....!

"వద్దొద్దు. వెళ్లి పోతాను"

"ఇప్పుడా ?"

"ఏం ఫర్లేదు. చిన్న కారుందిగా" గేటు వైపు నడుస్తూ అన్నాను.

ఇంకొక్క క్షణం కూడా అక్కడ నిలబడ గల శక్తి నాకు లేదు. ఇంకెవరైనా నన్ను అందలం ఎక్కిస్తే భరించగల సత్తాలేదు నా గుండెకు.

"పోనీ తెల్లారేక బయల్దేరితే బావుండేది" నా వెనుకే వస్తూ అన్నాడు మావయ్య.

"ఇప్పుడే వెళ్ళిపోతున్నారా" ఎవరెవరో అడుగుతున్నారు.

తలొంచుకుని నడుస్తున్నను.

వాళ్ళ మొఖాల్లోకి చూడగల ధైర్యం ఏ కోశానా లేదు నాకు. వాళ్లంతా ఎంతో పెద్ద వాళ్లలా గొప్ప వాళ్ళలా కన్పిస్తున్నారు. నా కళ్లకి. వాళ్ళ ముందు నేను అల్పజీవిలా లిల్లీపుట్‌లా వున్నట్టన్పిస్తోంది!

కారెక్కాను.

"అందర్నీ అడిగినట్టు చెప్పండి" మావయ్య అన్నాడు.

తలూపాను-వంచిన తల ఎత్తకుండానే.

కారు కదిలింది.

నా వెనక నన్ను చూసి యువకులంతా విరగబడి నవ్వుతున్నట్టు భ్రమ!

ఒళ్ళో తల దాచుకుని బావురుమన్నాను చిన్నపిల్లాళ్లా!

....o....

(1981 చక్రపాణి ద్వితీయ అవార్డు పొందినకథ. యువ '82)